



మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం
బుధవారం 27 మే 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2




## గెలుపే ధ్యేయంగా కలకోట లక్ష్మయ్య ప్రచారం





భానుపురి/ సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా పోటీ చేస్తున్న కలకోట లక్ష్మయ్య సూర్యాపేటలో గత పది రోజులుగా కలకోట లక్ష్మయ్య తో పాటు వారి మిత్రబృందం గెలుపు దిశగా ఉధృతంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. వీరితో పాటు యువత ఎంతో ఉత్సాహంతో ఇంటింటికి తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఎక్కడికి వెళ్ళినా గతంలో మీరు చేసిన సేవలు అమోఘం అంటూ కొనియా డుతున్నారు. పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా గెలిపించినట్లయితే ఆర్యవైశ్యుల అభ్యున్నతికి 24 గంటలు పని చేస్తారని తెలుపుతున్నారు. ఈనెల 31న రవి మహల్ లో జరిగే పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఓటు వేయవల సిందిగా అభ్యర్థిస్తున్నారు. వీరి వెంట ఆర్యవైశ్య మహాసభ నాయకులు మీలా వంశీ, వెంపటి శబరినాథ్, ఉప్పలంచు కృష్ణ, దేవరశెట్టి సత్యనారాయణ, వంగవీటి రమేష్ తదితరులు ప్రచారంలో పాల్గొంటున్నారు.




## బహిరంగంగా మద్యం సేవించడం అసాంఘిక చర్య





భానుపురి/సూర్యాపేట టౌన్

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నాలుగు పోలీస్ బృందాలు ఏర్పాటు చేసి సూర్యాపేట పట్టణ శివార్లలో బహిరంగ ప్రదేశాలలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి అసాంఘిక చర్యను నిర్మూలించడమే లక్ష్యంగా విస్తృతంగా సోధాలు నిర్వహించడం జరిగిందని సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. ఈ తనిఖీల కోసం డ్రోన్ కెమెరాలు సమర్థవంతంగా ఉపయోగించాం అన్నారు. ఈ తనిఖీల్లో 10 కేసులు నమోదు చేయడం జరిగినది. బహిరంగంగా మద్యం సేవించడం అనేది ఒక అసాంఘిక చర్య , సామాజిక దురాచారం. ఇలాంటి చర్యలను సమాజం హర్షించదు, చట్టం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవు అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల ఆ మార్గంలో వెళ్లే సామాన్యులకు, ముఖ్యంగా మహిళలకు, చిన్న పిల్లలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, దీనిని అరికట్టేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసిందని సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ తెలిపారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకునేందుకు సూర్యాపేట పట్టణ పోలీసులు కొత్త వ్యవసాయ మార్కెట్ ఏరియా, అమ్మ గార్డెన్ ఏరియా, పుల్లారెడ్డి చెరువు ఏరియా, ఈనాడు ఆఫీస్ వెనకాల, సద్దల చెరువు ఏరియా చుట్టుపక్కల ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రోన్ కెమెరాలతో సోదాలు నిర్వహించారు. ఎవరైనా బహిరంగంగా మద్యం సేవిస్తున్నారా, పేకాట లాంటి అసాంఘిక చర్యలు పాల్పడుతున్నారు అనే విషయాన్ని పర్యవేక్షించడానికి అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఉంచడం జరిగింది అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాము. నేరం రుజువైతే జైలు శిక్షలు కూడా తప్పవు" అని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా యువత ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాజానికి సహకరించాలని కోరారు. ఇలాంటివి ఎక్కడైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ఏడుకొండలు, మహేందర్ నాథ్, శివతేజ, వెంకన్న లు నాలుగు బృందాలను నడిపించారు. సిబ్బంది పాల్గొన్నారు.




## పథకం ప్రకారం హత్య.. 12 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు

భానుపురి/ సూర్యాపేట ఎస్పీ కార్యాలయం




సూర్యాపేట జిల్లా రూరల్ పరిధిలోని సోలిపేట గ్రామంలో జరిగిన మేకల జయరాములు హత్య కేసును పోలీసులు కేవలం 12 గంటల్లోనే ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు జయరాములు తనకు వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల భూమిని గతంలో తన తమ్ముడు కృష్ణయ్యకు కౌలుకు ఇచ్చాడని, అనంతరం తిరిగి స్వయంగా సాగు చేసుకోవడం ప్రారంభించడంతో కుటుంబ సభ్యుల మధ్య భూమి, గెట్టు, ఇంటి హద్దుల విషయంలో తరచూ వివాదాలు నెలకొన్నాయని తెలిపారు. ఈ క్రమంలో నిందితులు మేకల కిరణ్, అతని భార్య మౌనిక, కిరణ్ తల్లిదండ్రులు కృష్ణయ్య, లక్ష్మమ్మ, మరో వ్యక్తి రామచంద్రు కలిసి జయరాములను హత్య చేయాలని ముందుగానే పథకం రచించినట్లు ఎస్పీ వెల్లడించారు. సోమవారం సాయంత్రం జయరాములు పొలం వద్దకు వచ్చిన సమయంలో గ్రామ ఆర్చ్ సమీపంలో అడ్డగించి గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. హత్య అనంతరం నిందితులు గ్రామం విడిచి పారిపోయారని, కేసు నమోదు చేసిన వెంటనే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సూర్యాపేట హైటెక్ బస్ స్టాండ్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన గొడ్డలి, నాలుగు సెల్ ఫోన్లు, ఒక స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులకు గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదన్నారు. భూమి, ఆస్తి తగాదాలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని, ఓర్పు కోల్పోయి హత్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. భూమి వివాదాల కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్షలు కూడా పడుతున్నాయని గుర్తుచేశారు. కేసును వేగంగా ఛేదించిన డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్సై బాలు నాయక్ పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## పేదల పాలిట అండ సీఎం రిలీఫ్ ఫండ్



భానుపురి /సూర్యాపేట టౌన్

తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మంగళవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్య చికిత్సల సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు సహాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలు ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండెబోయిన సాయి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, సంగు శ్రీనివాస్, ధారవత్ హర్యా, ధారవత్ సైదా, తంగేళ్ల పిచ్చయ్యలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.

# బాల్య వివాహాల నిర్మూలనతోనే మహిళా సాధికారత సాధ్యం

భానుపురి/మునగాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “99 రోజుల ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక” మహిళా వారోత్సవాలలో భాగంగా మునగాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీ సూపర్వైజర్ శ్రీలత విద్యాసాగర్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ చైతన్య హాజరై మాట్లాడుతూ, సమాజానికి శాపంగా మారిన బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా తీవ్రమైన ఇబ్బందులకు గురవుతారని, వారి చదువు మధ్యలోనే ఆగిపోయి భవిష్యత్తు అంధకారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల నిరోధక చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. తెలంగాణ ‘స్నేహ గ్రూపుల’పై అవగాహన: ఇదే క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాలికల రక్షణ,



వారి హక్కుల కోసం ఏర్పాటు చేసిన “స్నేహ గ్రూపుల” ప్రాముఖ్యతను ఆమె వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు, యువతులు తమ సమస్యలను పంచుకోవడానికి, బాల్య వివాహాలు, వేధింపుల వంటి సామాజిక అరిష్టాలపై పోరాడటానికి ఈ స్నేహ గ్రూపులు ఒక అద్భుతమైన వేదికగా పనిచేస్తున్నాయని తెలిపారు. బాలికలు ధైర్యంగా ముందడుగు వేసి ఈ గ్రూపుల ద్వారా లభించే ప్రభుత్వ సహాయాన్ని, రక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ శ్రీలత మాట్లాడుతూ, గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక మహిళలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆడపిల్లలను భారంగా భావించకుండా ఉన్నత చదువులు చదివించి, వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించాలని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీల శ్రీనివాస్ ఉపసర్పంచ్ పంచాయితీ సెక్రటరీ చంద్రశేఖర్ మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వినోద్ అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, కిషోర బాలికలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఎలిమినేటి అజయ్ కుమార్ ను పరామర్శించిన మాజీమంత్రి జగదీష్ రెడ్డి


భానుపురి/ సూర్యాపేట టౌన్



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీ నగర్ లో ప్రముఖ కాంట్రాక్టర్, సీనియర్ నాయకుడు ఎలిమినేటి అజయ్ కుమార్ సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి నివాసానికి మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి చేరుకొని ఆమె చిత్రపటానికి నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# కరెంట్ షాక్‌తో కాంట్రాక్టర్ మృతి

భానుపురి/పాలకవీడు



సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్పహాడ్ దర్గా వద్ద విషాద ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌కు గురై ఎస్ఆర్ కాంట్రాక్ట్ కంపెనీ ఓనర్ కుర్ర రవి మృతి చెందినట్లు సమాచారం. నిన్న గాలి దుమారంతో పడిపోయిన విద్యుత్ పోల్స్, లైన్లను సరిచేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై బంధువులు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బాలికలకు మహిళ సమాఖ్యల ద్వారా సైకిళ్లు పంపిణీ

భానుపురి/ తిరుమలగిరి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక’లో భాగంగా మహిళా సాధికారత కోసం మంగళవారం తిరుమలగిరి మండల సమైక్య ఆధ్వర్యంలో ‘మహిళా శక్తి’ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తిరుమలగిరి మహిళ సమైక్య ఆధ్వర్యంలో స్నేహ సంఘాల బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత బాలికల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. బాలికలకు క్రీడల పట్ల అవగాహన కల్పించడంతో పాటు, సైక్లింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి, మక్కువ ఉన్న విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ఈ సైకిళ్లను అందజేసినట్లు తెలిపారు. సైక్లింగ్ అనేది శారీరక దృఢత్వానికి మాత్రమే కాకుండా, బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఎంతగానో తోడ్పడుతుందని ఆయన అన్నారు. మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో తిరుమలగిరి తహసిల్దార్ హరి ప్రసాద్, ఎంపీడీవో లాజర్, ఏపిఎం లక్ష్మి సిసి నాగయ్య, ఎమ్మెస్ అధ్యక్షురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

## బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ

భానుపురి /సూర్యాపేట టౌన్.



వేసవి నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్ హెచ్ ఆర్ సి ) ( వివో) రాష్ట్ర చైర్మన్ చింతపల్లి వెంకటేశ్వర్లుఅన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ హెచ్ ఆర్ సి (వివో ) జాతీయ మానవ హక్కుల మండలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరం ఉంటేనే బయటికి రావాలని తెలిపారు. ప్రజల హక్కులను కాపాడేందుకు నేషనల్ వుమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ హెచ్ ఆర్ సి (వివో ) ముందు ఉంటుంది అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండడమే కాకుండా చట్టబద్ధంగా చట్ట పరిధిలో ప్రజల తరఫున నిలబడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్ల రమేష్, ఉమ్మడి నల్లగొండ జిల్లా జనరల్ సెక్రెటరీ బార్వటి సునీత, జిల్లా మహిళా అధ్యక్షురాలు పుష్ప, కన్వీనర్ సారగండ్ల సైదులు, కోఆర్డినేటర్ కృష్ణ,చంద్రకళ పాల్గొన్నారు

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి



భానుపురి/ చివ్వెంల

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మరియు రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం చివ్వెంల మండలం బిబి గూడెం లోని శివ దుర్గ రైస్ మిల్, తిరుమలగిరి మండలాల్లోని ఇటూరు గ్రామంలో సోమేశ్వర రైస్ మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారా రైస్ మిల్, తాటిపాముల పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే ఆన్ లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కలెక్టర్ వెంట డీఎస్ఓ మోహన్ బాబు, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, చివ్వెంల తహసిల్దార్ చంద్రశేఖర్, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, రైస్ మిల్లర్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 2న పిఆర్సి ప్రకటించాలి

భానుపురి/సూర్యాపేట టౌన్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్సి ప్రకటించాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ మోతీలాల్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఇచ్చే పి ఆర్ సి ఇప్పటివరకు ప్రకటించక పోవడం శోచనీయమని ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి హక్కులను కాలరాస్తూ మాటలకే పరిమితం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ ప్రభుత్వం కళ్లు తెరిచి వెంటనే పిఆర్సి ప్రకటించాలని కోరారు. లేని ఎడల జూన్ రెండు తర్వాత పెద్ద ఎత్తున ఉద్యోగ,ఉపాధ్యాయులు ఆందోళన, ఉద్యమం చేయాల్సి వస్తుందని తెలియజేస్తున్నాము. ఎన్నో ఆకాంక్షల మేరకు సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, ప్రజలు సంతోషంగా లేరని తెలుస్తుంది. ఆర్థిక భారాన్ని మోయలేక చాలా ఇబ్బంది పడుతున్న ఉద్యోగుల విషయంలో ఆలోచించి ప్రభుత్వం జూన్ 2న పి అర్ సి వెంటనే ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు ఈ హెచ్ ఎస్ అమలు విషయంలో గందరగోళాన్ని తావివ్వకుండా ఈ హెచ్ ఎస్ కార్డు జారి చేయాలని కోరారు. సెన్సెస్ జూన్ 9 నాటికి పూర్తి అవుతున్నందున జూన్ 10లోపు ఉపాధ్యాయులకు పదోన్నతి,బదిలీల షెడ్యూలు కూడా జారీ చేయాలని, ఆ కార్యక్రమానికి పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందున ఈలోపు విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు మరియు విద్యార్థి కిట్లు అందజేసి, 2026-27 విద్యా సంవత్సరం విజయవంతం చేయవలసిందిగా, ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.



## లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా ఉయ్యాల నర్సయ్య నియామకం

భానుపురి/కోదాడ



బీపీల్ కు దిగువన ఉన్న పేదలకు న్యాయసహాయం అందించడానికి రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ (న్యాయ సహాయక న్యాయవాది)గా యువ న్యాయవాది ఉయ్యాల నర్సయ్య ను నియామకం చేస్తూ ఆర్డర్ నెం. ROC.1348/TSLSA/2026 ద్వారా సోమవారం నాడు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా నియామించబడిన ఉయ్యాల నర్సయ్య మాట్లాడుతూ లక్ష రూపాయల లోపు ఆదాయం కలిగిన పేదలకు, న్యాయవాదిని నియమించుకోలేని పేదలకు న్యాయ సహాయ చేయడానికి నన్ను నియమించిన రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ వారికి ధన్యవాదాలు తెలిపారు. అందరికి న్యాయం అందించడానికి నా శక్తి మేరకు కృషి చేస్తానని, అభాగ్యులకు అండగా ఉంటానన్నారు. న్యాయవాదిగా 16 సంవత్సరాల నుండి ఎంతోమందికి నా న్యాయ సేవలు అందించానని, ఇప్పుడు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా పేదలకు అన్ని రకాల న్యాయ సేవలు 3 సంవత్సరాల పాటు కొనసాగడానికి నన్ను లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా నియమిస్తూ ఆర్డర్ వచ్చినట్లుగా తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ కక్షిదారులకు న్యాయం చేస్తానని, చట్టాలపై ప్రజలను చైతన్యం చేస్తూ,న్యాయ వ్యవస్థ గౌరవం పెంచుతూ, చట్టం పరిధిలో తగిన సహాయ,సహకారాలను పేద ప్రజలకు అందిస్తానని చెప్పారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా నియామకం అయిన ఉయ్యాల నర్సయ్య ను పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందించారు.

# వాటర్ ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

భానుపురి /సూర్యాపేట టౌన్

వేసవి తీవ్రత పెరగడంతో సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొన్న నేపథ్యంలో, స్థానిక 15వ వార్డు కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వార్డులో నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయిస్తూ, ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారు.కేవలం ట్యాంకర్లు పంపించడం మాత్రమే కాకుండా, నీరు సరైన ప్రాంతాలకు చేరుతున్నదా లేదా, ప్రతి కాలనీ ప్రజలకు సమానంగా అందుతున్నదా అనే అంశాలను దగ్గరుండి స్వయంగా పర్యవేక్షిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు నీటి కోసం ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటుండటంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్ చురుకైన పాత్ర పోషించడం పట్ల 15వ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటి కొరత సమయంలో అందుబాటులో ఉండి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న పిల్లల భవాని రమేష్ పనితనం అభినందనీయమని పలువురు స్థానికులు




పేర్కొంటున్నారు. ఇలాంటి సేవా భావంతో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులు అవసరమని వార్డు వాసులు అభిప్రాయపడుతున్నారు.